
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 23 సెప్టెంబరు 2025





ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

జనాల్లోకి చేరని జీఎస్టీ 2.0

- దుకాణాల ముందు కానరాని ధరల పట్టికలు
- ధరలు పెరిగితే అర్ధరాత్రి నుంచే అమలు..
- తగ్గిస్తే మాత్రం పాత రేట్లకే..
- వినియోగదారుల నుంచి భిన్నాభిప్రాయాలు

పాత రేట్లకే ఔషధాలు అమ్ముతున్నారు..



రాయచోటి పట్టణంలో ఔషధాలను పాతరేట్లకే విక్రయిస్తున్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని కంసలవీధిలో ఉన్న ఓ ఫార్మసీలో తడి టిష్యులు కొనుగోలు చేశాను. ఔషధాలపై ప్రస్తుతం 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించినప్పటికీ పాత రేట్లకే విక్రయిస్తున్నారు. నేటి నుంచి తగ్గించిన జీఎస్టీ అమలులోకి వస్తుందని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇక్కడ అమలు కావడం లేదు.

- చరణ్, రాయచోటి

జీఎస్టీ తగ్గించడం మంచిదే..



పేదలకు నిత్యం ఉపయోగపడే వస్తువులపై నియంత్రణలో భాగంగా తీసుకున్న జీఎస్టీ స్లాబుల ఏర్పాటు నిర్ణయం పట్ల కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాము. నిత్యావసర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువులపైన జీఎస్టీ మినహాయించడం చాలా శుభపరిణామం. అదే విధంగా ఆయా షాపులలో వస్తువుల ధరల పట్టికలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- ఆంజనేయులు, రాయచోటి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమలులోకి వచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ 2.0) ఇంకా జనాల్లోకి చేరలేదు. కేంద్ర ప్రభుత్వం సామాన్యులను దృష్టిలో ఉంచుకుని నిత్యావసరాల ధరలు గణనీయంగా తగ్గించినప్పటికీ దీనిపైన ప్రజల్లో ఆశించినంత అవగాహన లేదు. దీంతో జిల్లాలో జీఎస్టీ 2.0 అమలు కాలేదనే చెప్పవచ్చు. సామాన్య ప్రజలు నిత్యం కొనుగోలు చేసే అనేక ముఖ్యమైన వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించింది. వాస్తవానికి ఈ మేరకు వ్యాపారులు ప్రజలకు కొత్త జీఎస్టీ ధరల ప్రకారం అమ్మకాలు జరపాలి. అయితే ఇప్పటికే దుకాణాల వద్ద ధరల పట్టికలు లేకపోవడం.. కొత్త ధరలపైన ప్రజలకు అవగాహన లేకపోవడంతో సోమవారం పాత ధరలతోనే కొన్నిచోట్ల వ్యాపారాలు జరిగాయి. నిత్యావసర సరుకులతో పాటు కార్లు, ఏసీలు, టీవీలు, ఇతర వస్తువుల తగ్గిన ధరల ప్రకారం కాకుండా పాత ధరలతోనే అమ్మకాలు జరిగాయి. దీనిపైన ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా వ్యాపారులు దుకాణాల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తగ్గిన జీఎస్టీ ధరలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన పెంచాలని కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలులో ఉన్న విలువ ఆధారిత పన్నులను (జీఎస్టీ) మూడు స్లాబులుగా విభజించింది. ఇప్పటి వరకు అమలులో ఉన్న రేట్లను ఉన్న ఫలంగా తగ్గించింది. దీంతో సామాన్యునికి ఎంతో మేలు కలగనుంది. పలు నిత్యావసరాలపై 18 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించింది. ఆరోగ్యబీమా,పలు స్టేషనరీ వస్తువులపై జీఎస్టీని సున్నాగా మార్చింది. ఔషధాలపై 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు, చిన్నకార్లు, బైక్‌లపై 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు, ఏసీలు, టీవీలపై 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది.

జీఎస్టీ 2.0తో తగ్గనున్న ధరలు

పాలు, నెయ్యి, పన్నీర్, జున్ను, బియ్యం, పప్పులు, సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్ట్, బ్రష్, ఫేస్ పౌడర్, హెయిర్‌ఆయిల్, బట్టలు, చెప్పులు, షూ, కిచెన్ వేర్, డ్రైఫ్రూట్స్, హ్యాండ్‌బ్యాగులు, పౌచ్‌లు, పర్సులు, కేక్‌లు, బిస్కెట్లు, కార్న్‌ఫ్లేక్స్, బేకరీ ఉత్పత్తులు, స్టీల్ గిన్నెలు, మసాలాలు, మసాలా పొడి, టీ, కాఫీ పొడి, డయాగ్నస్టిక్ కిట్లు, ఫీడింగ్ బాటిళ్లు, సర్జికల్ గ్లౌజులు, కార్లు, 350 సీసీ బైక్ ధరలు, విద్యుత్ వాహనాలు, అంబులెన్స్, బస్సులు, ట్రక్కులు, టైర్లు, ట్రాక్టర్ విడిభాగాలు.. ఏసీ, టీవీ, ఫ్రిడ్జ్‌లు, ప్రెషర్ కుక్కర్లు, ఎల్‌ఈడీలపై ధరలు తగ్గి సామాన్యులకు అందుబాటులోకి రానున్నాయి.



పెరిగితే అర్ధరాత్రి నుంచే పెంచుతారు.. తగ్గితే మాత్రం చెప్పరు..



వ్యాపారులు ఏవైనా సరుకులపైన ధరలు పెరిగితే అర్ధరాత్రి నుంచే ప్రజల దగ్గర పెరిగిన ధరల ప్రకారం వసూలు చేస్తారు. తగ్గిస్తే మాత్రం చెప్పరు. ప్రభుత్వం నిత్యావసర సరుకులపై 18 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించినట్లు ఇంత వరకు నాకు తెలియదు. ఈరోజు వేరుశనగ నూనె 10 కిలోలు 1650 చెప్పారు. రూ.1600లకు ఇచ్చారు. ప్రజలు వ్యాపారుల దగ్గర నష్టపోతూనే ఉన్నారు. ఇకనైనా తగ్గిన జీఎస్టీ ప్రకారం సరుకులు అందించాలి.

- వెంకటరమణ, శెట్టిపల్లె

తగ్గిన జీఎస్టీ విషయం తెలియదు..



ఓ మార్ట్‌లో రియల్ ఫ్రూట్ పవర్ జ్యూస్ కనుగోలు చేశాను. దీనిపై ఎమ్మార్పీ ధర 150 ఉంది. దీనికి ఆఫర్ రేట్ పెట్టారు. రూ.82కు ఇచ్చారు. జీఎస్టీ తగ్గిన విషయం నాకు తెలియదు. వ్యాపారులు గత ఎమ్మార్పీకే అమ్ముతున్నారు.

- దేశ్‌ముఖ్ గుల్‌షేర్ అలీఖాన్

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని, అధికారులందరూ వందశాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. రాయచోటి మండలం పెమ్మాడపల్లి గ్రామం గరుగుపల్లికు చెందిన పల్లవు చిన్నిమ్మి తనకు ఇల్లు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లె గ్రామం చమర్తివాండ్లపల్లెకు చెందిన చమర్తి వెంకటసుబ్బమ్మ భర్త 2021 డిసెంబరులో మరణించాడని, 72 సంవత్సరాలు ఉన్న తనకు ఎలాంటి జీవనాధారం లేదని నాకు పింఛన్ ఇప్పించాలని జాయింట్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జీఎస్ డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువకు మరమ్మతులు



మద్దయ్యగారిపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మద్దయ్యగారిపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువకు గండిపడిన చోట సోమవారం అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. పెద్దతిప్పసముద్రం మండలంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు హంద్రీ-నీవా కాలువకు గండిపడిన విషయం తెలిసిందే. దీంతో కాలువకు గండిపడి తెగిపోయిన చోట హంద్రీ-నీవా అధికారులు టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి మరమ్మతు పనులు చేపట్టారు. అనంతపురం సరిహద్దు గ్రామమైన గుడ్డంపల్లె నుంచి పెద్దతిప్పసముద్రం మండల సరిహద్దు వరకు ప్రమాదకరంగా ఉన్న చోట మరమ్మతులు చేపట్టి నీటిని యధాప్రకారం దిగువ ప్రాంతానికి మళ్లించారు.

నాటుసారా రహిత గ్రామాలుగా మారాలి

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్



షేకే నాయక్‌తండాలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

పెద్దమండ్యం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, అమ్మకాలకు స్వస్తి పలికి నాటుసారా రహిత గ్రామాలుగా గుర్తింపు రావాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం మండలం షేకే నాయక్‌తండాలో సోమవారం నవోదయం 2.0, నాటుసారా నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా అమ్మకాలతో కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకోవద్దని, తమ పిల్లల ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మీ మంచి భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తండావాసులు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తేవడంతో మీ సమస్యలన్నీ దగ్గర ఉండి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి, పోలీసులు జాఫర్‌ఖాన్, శివకుమార్, మండల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు 25న నియామక పత్రాలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మెగా డీఎస్సీ-2025కు ఎంపికైన అభ్యర్థులు 25వతేదీ గురువారం విజయవాడలో జరిగే నియామకపత్రాల స్వీకరణ కార్యక్రమానికి హాజరు కావాలని డీఈఓ షంషుద్దీన్ సోమవారం తెలిపారు. ఈనెల 19న రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు 24వ తేదీ బుధవారం ఉదయం 6గంటలకు కడప ఆర్ట్స్ కళాశాలకు చేరుకుని తమ ఐడెంటిటీ కార్డులతో మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం వారికి కేటాయించిన బస్సుల్లో విజయవాడకు వెళ్లాలని చెప్పారు. అభ్యర్థులు తదుపరి సూచనలకోసం మెగా డీఎస్సీ వాట్సప్ గ్రూప్‌లో వచ్చే సమాచారాన్ని అనుసరించాలని సూచించారు.

మహిళా సమైఖ్యలో గోల్‌మాల్

- కార్యాలయ అకౌంటెంట్ చేతివాటం
- గ్రూపు సభ్యుల నగదు స్వాహా..?
- ఎంపీడీవో విచారణ



ములకలచెరువు మండల మహిళా సమైఖ్య కార్యాలయం



గ్రూపు సభ్యులను విచారిస్తున్న ఎంపీడీవో హరినారాయణ

ములకలచెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో అకౌంటెంట్ చేతివాటం ప్రదర్శించి డబ్బు స్వాహా చేసిన విషయం బయటపడింది. గ్రూపు సభ్యులను మభ్యపెట్టి వారి పేర్ల మీద రుణాలు మంజూరు చేయడం, అందులో సగం తీసుకుని తిరిగి చెల్లించకుండా స్వాహా చేసినట్లు వెల్లడైంది. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో విచారణ చేపట్టడంతో స్వాహాపర్వం వెలుగులోకి వచ్చింది. ములకలచెరువులోని మండల మహిళ సమైఖ్య కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సాయిలీల పలువురు గ్రూపు సభ్యులకు మభ్యపెట్టి వారి పేర్ల మీద సీఐఎఫ్ రుణాలు మంజురు చేయించి, అందులో సగం తీసుకుని చెల్లించకుండా అక్రమాలకు పాల్పడిందని ఈనెల 15వ తేదీ జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ములకలచెరువుకు చెందిన సోమశేఖర్ కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. కార్యాలయంలో పనిచేసే స్వీపర్ గౌరవవేతనం కూడా ప్రతి నెలా రూ.2 వేలు డ్రా చేస్తూ స్వీపర్‌కు మాత్రం రూ.1500 ఇస్తోందని, మండల సమైఖ్య సమావేశాల సందర్భంగా తెప్పించే భోజనాల కంటే రెట్టింపుగా బిల్లులు పెడుతూ నగదు స్వాహా చేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టి నివేదికలు అందజేయాలని ఎంపీడీవో హరినారాయణను ఆదేశించారు. ఈ విషయమై ఎంపీడీవో ముమ్మరంగా విచారణ చేపట్టారు. ములకలచెరువుకు చెందిన తులసీ, సీతా, పెద్దపాళ్యం పంచాయతీ రామానాయునికోటలోని నందిని గ్రూపులలోని ముగ్గురు సభ్యులను సోమవారం ఎంపీడీవో విచారించారు. మండల మహిళా సమైఖ్య నగదును వీవోకు బదిలీ చేసి అక్కడి నుంచి తమ గ్రూపుల ఖాతాలకు రూ.లక్ష చొప్పున వేసి సగం తమకు ఇచ్చి మిగతా సగం అకౌంటెంట్ తీసుకుందని సభ్యులు రాతపూర్వకంగా రాసి ఎంపీడీవోకు ఇచ్చారు. అకౌంటెంట్ తమ నుంచి తీసుకున్న రూ.1.50 లక్షల్లో కేవలం రూ.30 వేలు చెల్లించి మిగితాది చెల్లించలేదని తెలియజేశారు. విచారణ నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు. విచారణలో ఏపీఎం మధుబాబు కూడా ఉన్నారు. కాగా మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో జరిగిన గోల్‌మాల్‌పై లోతుగా విచారణ చేపడితే మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- పోలీసు అధికారులను ఆదేశించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



వృద్ధుల వద్దకే వచ్చి వారి సమస్యలను వింటున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటికి తక్షణ పరిష్కారం చూపించడమనేది పోలీసు వ్యవస్థలో అత్యంత ప్రధానమైన బాధ్యతని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పలు సమస్యలపై జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి రాలేని అర్జీదారులు వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయంలో అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నడవలేని స్థితిలో ఉన్న బాధితులను చూసి ఎస్పీ స్వయంగా వారి వద్దకే వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి మానవత్వం చాటుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ముఖ్యమైన ఫిర్యాదులపై అప్పటికప్పుడే స్పందించిన ఎస్పీ ఆ ఫిర్యాదులపై ఆయా ప్రాంతాల పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీటిలో ముఖ్యంగా రైల్వేకోడూరు మండలానికి చెందిన బత్తల ఈశ్వరమ్మ తన సమస్యను వివరించగా అది విన్న ఎస్పీ వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని రాజంపేట ఏఎస్పీని ఆదేశించారు. అలాగే పుల్లంపేట మండలానికి చెందిన చింతారెడ్డి వెంకటరెడ్డి సమస్యను వినగానే ఎస్పీ వెంటనే రాజంపేట ఏఎస్పీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుండుపల్లె మండలానికి చెందిన కె.చిన్నయ్య తన ఇబ్బందులను వివరించగా ఎస్పీ స్పందిస్తూ సమస్యను రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌కు అప్పగించారు. ప్రజలు ఎలాంటి సమస్యనైనా భయపడకుండా పోలీసుల వద్దకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ సూచించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉన్నారని, న్యాయం చేస్తామని బాధితులకు ధైర్యం చెప్పారు.

దసరాకు 100 ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని వివిధ ప్రాంతాలలో ఉన్న జిల్లాకు చెందిన వారు సొంత ఊర్లకు వచ్చేందుకు అనువుగా సుమారు 100 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రీజనల్ మేనేజర్ సముదాయ భవనంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లాలోని ఆరు డిపోల నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు ఈనెల 30వ తేదీ మంగళవారంతో పాటు అక్టోబరు 1వ తేదీ బుధవారం రోజు ప్రయాణికుల సేవలో ఉంటాయన్నారు. ఇందులో ప్రధానంగా హైదరాబాద్ నుంచి జిల్లాకు 30 ప్రత్యేక బస్సులు, బెంగళూరు నుంచి 30, చెన్నై నుంచి 10 బస్సులు నడుస్తాయన్నారు. ఈనెల 27, 28 తేదీలలో విజయవాడ నుంచి 30 ప్రత్యేక బస్సులు జిల్లాకు రానున్నాయన్నారు. ప్రజలు ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులలో జిల్లాకు సురక్షితంగా చేరుకోవాలని కోరారు. కాగా.. తిరుమలలో జరగనున్న బ్రహ్మోత్సవాలను తిలకించే భక్తుల సౌకర్యార్థం ఈనెల 27, 28 తేదీల్లో 40 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్ఎం తెలిపారు.

కలికిరిలో మహిషాసురమర్దినిగా పార్వతీదేవి



బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో పీలేరు రౌద్రాల అంకాలమ్మ, గుర్రంకొండ రెడ్డెమ్మ తల్లి





మదనపల్లెలోని దుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వీరభద్రాలయంలో భద్రకాళీదేవి అలంకారంలో అమ్మవారు



రాజంపేటలో దీక్షాబంధన అలంకారంలో కన్యకాపరమేశ్వరిదేవి

రాయచోటి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆలయాల్లో సోమవారం దసరా శన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు భద్రకాళీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని గాంధీబజారులో గల కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు వాసమాంబ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మొదటిరోజు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, తంబళ్లపల్లెతో పాటు మిగిలిన ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం మొదటిరోజు సందర్భంగా అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరణలు చేశారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకుని అమ్మవారికి దర్శించుకున్నారు.



వాల్మీకిపురంలో త్రిపుర సుందరీదేవి అలంకరణలో నల్లవీర గంగాభవానీ



రాయచోటి వీరభద్రాలయంలో భద్రకాళీదేవి అలంకారంలో అమ్మవారు

దారిద్ర్యం

దుస్థితిలో చెరువుకిందపల్లె దారి ● ఉన్న కాజ్‌వే కొట్టుకుపోయిన వైనం

పీలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తరాలు మారుతున్నా ఆ గ్రామం తలరాత మారడం లేదు. ఆధునిక యుగంలోకి అడుగు పెట్టినా ప్రధాన రహదారికి అనుసంధానం లేక తిప్పలు పడుతున్న కుగ్రామం అది. మండల కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ప్రధాన రహదారికి చేరుకోవాలంటే వాగు దాటాల్సిందే. పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి, భూస్వాముల పెత్తందారీతనానికి కేవీపల్లె మండలం ఎంవీపల్లె పంచాయతీ చెరువుకిందపల్లె సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. 25 దళిత కుటుంబాలు నివసిస్తున్న ఆ గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేక రాళ్లు రప్పలతో నిండిన దారిలో నడుస్తున్నారు గ్రామస్తులు. పగలు ఎలాగోలా సర్దుకుపోతున్నా రాత్రిళ్లు ఏదైనా ప్రాణాపాయం సంభవించినప్పుడు తమ అవస్థలు పగవాడికి కూడా వద్దంటూ వాపోతున్నారు.

108 వాహనం కూడా రాదు

ప్రధాన రహదారి నుంచి ఇంటికి చేరాలంటే ఆటోలకు రూ.150 నుంచి రూ.200ల దాకా చెల్లిస్తున్నామని, రాత్రిళ్లు అయితే అవి కూడా ఉండవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణం మీదకు వస్తే 108 వాహనం కూడా తమ గ్రామంలోకి రాదని అంటున్నారు. గ్రామం ఆవిర్భవించిన నాటి నుంచి దారి సౌకర్యం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని, రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్న తమను ఇప్పటికైనా పట్టించుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగు దాటాల్సిందే

ఎంవీ పల్లె పంచాయతీ పరిధిలోని చెరువుకిందపల్లె దళితవాడ నుంచి పీలేరు-సుండుపల్లె రోడ్డు మీదకు రావాలంటే గ్రామ సమీపంలో ప్రవహించే వజ్రాల వంక దాటాల్సిందే. గ్రామం చుట్టూ ఇతర గ్రామాలకు చెందిన వారి భూములు ఉండడంతో వారు దారి కోసం స్థలం ఇవ్వడానికి ఒప్పుకోలేదు. దీంతో చెరువుకిందపల్లె గ్రామం నుంచి వజ్రాల వాగు వద్దకు చేరుకోవాలంటే పొలాల మధ్య నుంచే నడుచుకుంటూ వెళ్లాలి. రాళ్లు రప్పలతో నిండిన ఆ దారిలో నడవడానికి చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల నుంచి తిరిగి వచ్చే విద్యార్థులు, పనుల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లే వారు ప్రతిరోజూ రాత్రివేళ ఆ దారిలో రావాలంటే గాయాల పాలవుతున్నారని వారు తెలిపారు. చెరువుకిందపల్లె దళితవాడలోని అందరూ వ్యవసాయ కూలీలు కావడంతో వారంతా భుక్తి కోసం బయటి ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి.



రాళ్లు రప్పలతో నిండి ఉన్న చెరువుకిందపల్లె దారి



చెక్ డ్యాం పక్కన గండి పడ్డంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



నీటి ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే

కొట్టుకుపోయిన కాజ్‌వే

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకిందపల్లెకు, పీలేరు, సుండుపల్లె రహదారికి అనుసంధానంగా ఉన్న వజ్రాల వంక కాజ్‌వే నాలుగు రోజుల క్రితం కొట్టుకుపోయింది. దీంతో చెరువుకిందపల్లె గ్రామం నుంచి రాకపోకలు ఆగిపోయాయి. విద్యాసంస్థలు, పనులకు పోకుండా ఆ గ్రామస్తులు రెండు రోజులు పూర్తిగా గ్రామంలోనే ఉండిపోయారు. వజ్రాల వంక ఉధృతి తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి కొంత మంది మహిళలు, యువకులు గ్రామం వెలుపలికి వచ్చారు. వజ్రాల వంకపై నిర్మించిన చెక్ డ్యాం పక్కన గండి పడడంతో నీటి ప్రవాహం పెరిగి కాజ్‌వే కొట్టుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు కోసం తరతరాలుగా వేడుకోలు

తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామం ఏర్పడిన నాటి నుంచి అనేక మంది పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు అందించి విసిగిపోయామని గ్రామస్తులు తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చేవారు రోడ్డు ఏర్పాటు చేస్తామని పలుమార్లు హామీలు గుప్పించినా అవి నీటి మూటలుగానే మిగిలిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామంలో ఎవరికైనా ప్రాణం మీదకు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం 108 వాహనం కూడా తమ గ్రామంలోకి వచ్చే అవకాశం లేదని వారు వాపోయారు.

ప్రతిపాదనలు పంపాం

- సుధాకర్, ఎంపీడీవో, కేవీపల్లె

చెరువుకిందపల్లె వద్ద కాజ్‌వే కొట్టుకుపోయిన సమాచారం అందగానే ఇరిగేషన్ శాఖాధికారులను అప్రమత్తం చేశాం. వారిని అక్కడకు పంపి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయమన్నాను. తక్షణ మరమ్మతుల కోసం రూ.10 లక్షలు అవుతుందని వారు తేల్చారు. ఆ ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపాం. అక్కడి నుంచి నిధులు, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. కాజ్‌వేను పునరుద్ధరించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న దారి సమస్య కూడా పరిష్కరిస్తాం.

ఆ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

రాయచోటి కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో చనిపోతున్న న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజు ఉదయం కోర్టు పని గంటల్లో సంతాపాన్ని తెలిపే సంస్కృతిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేయడాన్ని ఖండిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం 10.30 గంటలకు రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యులు ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధనతో కలిసి విధులు బహిష్కరించడానికి కారణాలను తెలియజేశారు. అనంతరం కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి బాషా మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ కారణాలతో చనిపోయిన న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజున ఉదయం 10.30 గంటలకు కోర్టుకు హాజరుకాగానే సంతాపాన్ని తెలియజేసే సంస్కృతి ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిందన్నారు.

వెనక్కి తీసుకోవాలి: ఐఏఎల్ డిమాండ్

న్యాయవాదుల సంతాప కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు కాకుండా సాయంత్రం సమయంలో జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సర్క్యులర్ ఇవ్వడం బాధాకరమని, ఈ సర్క్యులర్‌ను తక్షణం వాపసు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఎం.ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఉన్న సంస్కృతిని రద్దు చేయడం అంటే న్యాయవాదులందరినీ అవమానించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయండి

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డికి వినతి



ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డైట్ అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, వైసీ రెడ్డెప్పరెడ్డి కోరారు. సోమవారం వారు మంగళగిరిలోని ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో డైరెక్టర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో మొత్తం 29 పోస్టులు ఉండగా ప్రస్తుతం కేవలం 11 మంది అధ్యాపకులు మాత్రమే ఉన్నారని, 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత వలన ఛాత్రోపాధ్యాయులకు నాణ్యమైన బోధన అందడం లేదని, న్యాయం చేయాలని డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డికి విన్నవించారు.

పోలీసుల అదుపులో కూలీలు?



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న దుంగలు

సుండుపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న 9 మంది కూలీలను అన్నమయ్య జిల్లా రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. మండలంలోని రాయవరం అటవీ ప్రాంతంలోనికి ఎర్ర చందనం కూలీలు ప్రవేశించినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 12 దుంగలను స్వాధీనం చేసుకోగా దుండగులు పరారయ్యారు. అనంతరం నిర్వహించిన గాలింపు చర్యల్లో 9 మంది పట్టుబడగా, వారిని సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

ప్రావిడెంట్ ఫండ్ మిస్సింగ్ జమ చేయాలి



జడ్పీ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్)/రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఆన్‌లైన్ చేసిన తర్వాత ఆ స్లిప్పుల్లో జమ కాని నెలలకు సంబంధించిన మిస్సింగ్ క్రెడిట్‌లను వెంటనే ఉపాధ్యాయుల ఖాతాలకు జమ చేసి వాటిని ఆన్‌లైన్‌లో కనిపించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ కడప కార్యాలయంలో పరిపాలనాధికారి విజయభాస్కర్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నల్లమల రామాంజులు, మహమ్మద్‌రఫీలతో కలిసి సంబేపల్లె మండల ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు జమ కాని డిసెంబరు 2021, జనవరి 2022లకు సంబంధించిన వివరాలను అందజేశారు. వెంటనే వాటిని ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేసి ఆన్‌లైన్ కనిపించే విధంగా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఉద్యోగులు తమ అవసరాలకై దరఖాస్తు చేసిన రుణాలు అంతిమ చెల్లింపుల దరఖాస్తులను వారంలోగా మంజూరు చేయాలని కోరినట్లు తెలియజేశారు. జిల్లా పరిషత్ అధికారులు సానుకూలంగా స్పందించారని భవిష్య నిధి ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. త్వరలోనే వెబ్‌సైట్‌లో ఉంచడానికి ప్రయత్నిస్తామని ఉద్యోగుల రుణాలు అంతిమ చెల్లింపులను కార్యాలయ సిబ్బంది వీలైనంత త్వరగా మంజూరు చేసేలా కృషి చేస్తామని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ నాయకులకు అధికారులు తెలియజేశారు.


తంబళ్లపల్లె సబ్ ట్రెజరీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీటీఏఓ జయలక్ష్మి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఉప ఖజానా కార్యాలయాన్ని సోమవారం జిల్లా ట్రెజరీ అకౌంట్స్ అధికారి (డీటీఏఓ) జయలక్ష్మి తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సబ్ ట్రెజరీ కార్యాలయంలోని 2024-25 ఏడాదికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. పెన్షన్లు, ట్రెజరీ బిల్లుల రికార్డులను పరిశీలించారు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా కార్యాలయం సహా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. తనిఖీ బృందంలో ఎస్టీఓ రామాంజనేయులు, ఎస్ఏ ఆనంద్‌బాబు, సీనీ విష్ణువర్దన్, సీనియర్ అకౌంటెంట్ వెంకటేష్, ఆనంద్‌బాబు, ట్రెజరీ ఎస్టీఓ మారతమ్మ, ఎస్ఏ వెంకటకృష్ణ, జేఏ శ్రీనివాసులు, సిబ్బంది ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై జేసీకి వినతి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందచేశారు. ఏపీ వీఆర్‌ల సంఘం విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల రాష్ట్ర పిలుపు మేరకు వీఆర్‌ఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో సుమారు 30 మంది వీఆర్‌ఏలతో కలిసి పీజీఆర్‌ఎస్ హాల్‌లో జేసీకి వినతిపత్రం ఇచ్చి వీఆర్‌ఏల న్యాయపరమైన డిమాండ్స్‌ను తీర్చాలని కోరారు. వీఆర్‌ఏలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, రికవరీ చేసిన డీఏలను మళ్లీ మాకు తిరిగి ఇవ్వాలని కోరారు.

బినామీ పేర్లతో 60 ఎకరాల భూమి ఆక్రమణ

● చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ డిమాండ్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో లేని వ్యక్తి అక్రమంగా అనుభవిస్తున్న భూములను స్వాధీనం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం తహసీల్దారు యామినిని డిమాండ్ చేశారు. వై.కోట గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్లు 1294/1, 1295/1, 1295ఎ1, 1295/4, 1295/5, 1295/2లో దాదాపు 60 ఎకరాల ప్రభుత్వ భూమిని బినామీ పేర్లతో ఆక్రమించిన వీరంరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డిపై ఎందుకు కేసులు పెట్టలేదని ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ ఎం.జయరామయ్య ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడులేని నిరుపేద దళిత గిరిజనులు రెండు మూడు సెంట్లు ఆక్రమిస్తే తక్షణమే కేసులు పెడుతున్న రెవెన్యూ యంత్రాంగం వందల ఎకరాలు ఆక్రమించిన విజయ్‌కుమార్‌రెడ్డి పైన ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. నిరుపేదల పట్ల రెవెన్యూ యంత్రాంగానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎంక్వైరీ చేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఏటి పోరంబోకు, గుట్టలు వాగులు వంకలు నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించి కోట్ల రూపాయలు అమ్మకానికి పెడుతున్న భూ మాఫియా డాన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరుపేదలతో కలిసి ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోపాల్, సుబ్బరాఘవులు, వెలుగు మణి, చిన్న మణి, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, సుబ్బయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి సబ్‌జైలు తనిఖీ



సబ్‌జైల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

రాయచోటి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి సబ్‌జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కడప సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంపై వివరించారు.

ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఏదైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయసేవా సమితిని, కడప జిల్లా న్యాయసేవ అధికార సంస్థను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

'మెడికల్' ప్రైవేటీకరణను ఉపసంహరించండి

● ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి

● కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రాయచోటి కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):పీపీపీ పద్ధతిలో మెడికల్ కళాశాలల నిర్వహణ యోచనను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ విధానానికి కొత్త భాష్యం చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రైవేటు వారికి అప్పగించడం లేదని, ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని, కేవలం నిర్మాణాలు మాత్రమే ప్రైవేట్ చేస్తోందని చెప్పి సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కళాశాలల ప్రైవేటీకరణకు జారీ చేసిన పీపీపీ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, ముబారక్, బత్తల వెంకట్రమణ, నరసింహులు, తిరుమల, దేవా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అండర్ 19 జిల్లా ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపర్చిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ బాలబాలికల జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమైంది. నేడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు రాష్ట్ర స్థాయి పోటీలకు బయల్దేరారు. సోమవారం క్రీడాకారులకు సగ్రశిక్షణ నుంచి వచ్చిన వారికి క్రీడా దుస్తులను హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, రాములు అందజేశారు. మంగళవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్ ఎడ్యుకేషన్ డీఐఈఓ రాజశేఖర్‌రెడ్డి జిల్లా జట్టును అభినందించారు. కార్యక్రమంలో అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు, అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ, వ్యాయామ ఉపాధ్యాయులు అన్సర్, నరేశ్, విజయ్‌కుమార్, మహేంద్రనాయక్, మురళీధర్, బాలజీ, తదితరులు పాల్గొన్నారు.

పీకేఎం ఉడా చైర్మన్‌గా సురేశ్‌బాబు



కలికిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం ఉడా) చైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్.సురేశ్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పీకేఎం ఉడా పరిధిలో జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలతో పాటు పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలు ఉన్నాయి. ఈ మేరకు నియామకానికి సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటన చేయాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మదనపల్లె జిల్లాపై స్పష్టమైన ప్రకటన చేయాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఇక్కడి ప్రజలకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. స్థానిక బాస్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేస్తామని మదనపల్లెలో జరిగిన మినీ మహానాడులో, బెంగళూరు బస్టాండు వద్ద జరిగిన ఎన్నికల బహిరంగ సభలోనూ చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. యువగళం పాదయాత్రలో పీలేరు, మదనపల్లెల్లో నారా లోకేశ్ కూడా హామీ ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 16 నెలలైనా ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష అసెంబ్లీలో ఇప్పటికే రెండుసార్లు జిల్లా ప్రకటనపై విజ్ఞప్తి చేసినా ప్రయోజనం కన్పించడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. జిల్లా సాధన సమితి ప్రతినిధులు నీరుగట్టి రమణ, డేగాని రమణ, తెట్టు శ్రీనివాసులు, ఎస్.రెడ్డెప్ప, రవిశంకర్, తలారి కృష్ణ, రెడ్డిప్రసాద్, గంగులప్ప, బాషా, చంద్ర, పాల్గొన్నారు.


ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవంపై ఏర్పాటు చేసి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి , అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకీ ఉత్సవం అనంతరం అర్చకులు పల్లకీ ఉత్సవ విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆక్రమణలో చెరువులు


- పంటలు సాగు చేస్తున్న ఆక్రమణదారులు
- తగ్గిపోతున్న చెరువుల విస్తీర్ణం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు


కొండపేట చెరువు
చెరువును ఆక్రమించి సాగుచేసిన వరి

చెన్నూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగు చేసుకోవడానికి ఏర్పాటు చేసిన చెరువులు ఇప్పుడు కొందరి స్వార్థంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో ఆ చెరువు ఆయకట్టుకు నీరందక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలో ఐదు చెరువులు ఆయకట్టు చెరువులుగా అందుబాటులో ఉన్నాయి. అందులో కొండపేట చెరువు విస్తీర్ణం సుమారు వంద ఎకరాల వరకు వుంటుంది. అలాగే రాచిన్నాయపల్లె చెరువు విస్తీర్ణం దాదాపు 26 ఎకరాలు ఉంది. ఏటా పంటల కాలంలో ఈ చెరువుల కింద రైతులు వరి సాగు చేపడతారు. ప్రస్తుతం రాచిన్నాయపల్లె చెరవు కింద వరి సాగు చేపట్టగా, కొండపేట చెరువు కింద సాగుకు సిద్ధమయ్యారు. అయితే ఈ చెరువులు ఇప్పటికే ఆక్రమణకు గురికావడంతో పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం ఉండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు వంద ఎకరాలు విస్తీర్ణం ఉన్న కొండపేట చెరవులో పాతిక భాగం ఆ ప్రాంత రైతులే ఆక్రమించుకుని వరి సాగు చేపడుతున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం పాతిక భాగం వరకు తగ్గింది. పైగా చెరువు ఆయకట్టు కింద రైతుల పొలాల్లోకి నీళ్ల రాకుండా పెద్దకట్టలు ఏర్పాటు చేసుకున్నారు. ఇంకో వైపు చెరువులో కొందరు ఆక్రమణదారులు మామిడి చెట్లు పెంచేశారు. ఇక కొండపేట చెరువుకు అలుగు కాల్వను ఆక్రమించు కోవడంతో కుంచించుకుపోయింది. దీంతో పొలాలకు సక్రమంగా నీరందడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాచిన్నాయపల్లె చెరువులో సగభాగం ఆక్రమించారు. చెరువు విస్తీర్ణం 26 ఎకరాలు అంటారు. కనిపించేది సగమే. చెరువు ఆక్రమణల వల్ల నీటి నిల్వ శాతం తగ్గి ఆ నీరు బయటికి వెళ్లే తూములు కూడా చిన్నగా ఉండి సాగు కూడా తగ్గిపోతోంది. గ్రామంలోని ఇళ్లను అనుకుని ఉన్న ఈ చెరువును గ్రామంలోని వారే ఇష్టానుసారంగా ఆక్రమించుకుని చెరువులోకి చొచ్చుకు పోయారు. దీన్ని ప్రశ్నించేవారు ఎవరూ లేకపోవడంతో ఏటా చెరువు ఆక్రమణలు పెరుగుతూ భవిష్యత్తులో చెరువు కనిపించకుండా పోతుందేమోనన్న పరిస్థితి నెలకొంది.

కొండపేట చెరువులో అక్రమంగా వేసిన కట్ట



రాచిన్నాయపల్లె చెరువు
చెరువును ఆక్రమించి వేసిన వరినాట్లు

బలహీనమైన కట్టలు

చెరువుకు చుట్టూ నాలుగు వైపులా కట్టలు బలహీన పడ్డాయి. అటు కొండపేట చెరువు, రాచిన్నాయపల్లె చెరువుకు చెరువుకట్టలు సగమే ఉన్నాయి. పూర్తిస్థాయిలో చెరువు కట్టలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే సమయంలో చెరువును మొత్తం కొలతలు వేసి కట్ట ఎత్తు పెంచి ఆక్రమణలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కొండపేట, రాచిన్నాయపల్లె చెరువులకు ప్రభుత్వం రూ.కోటి 10 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందులో రాచిన్నాయపల్లె చెరువుకు రూ.74 లక్షలు, కొండపేట చెరువుకు రూ.40 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఇప్పటికైనా అధికారులు చెరువుల ఆక్రమణలపై దృష్టి పెట్టి బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

వాహనదారులకు మెరుగైన సేవలు

- ఉపరవాణా కమిషనర్ వీర్రాజు

సీకేదిన్నె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాహనదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఉపరవాణా కమిషనర్ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయానికి సంబంధించి వాహన్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేస్తామన్నారు. ప్రతి రోజు వచ్చే దరఖాస్తులను పూర్తి చేస్తామన్నారు. ఈకేవైసీ కొరకు 375 మంది దరఖాస్తు చేసుకున్నారని వాటిని కూడా త్వరగా పరిష్కరిస్తామన్నారు. హైపోర్టుకేషన్ టెర్మినేషన్‌కు సంబంధించి 393 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి సంబంధించిన వాహన యజమానులు, ఫైనాన్షియర్లు ఈ-అప్లికేషన్లను ఏ ఫైనాన్షియల్ ఐడీకి మ్యాపింగ్ చేయాలో అర్జీ రాసి ఫారం-35, ఆర్‌సీ జిరాక్స్ జత చేసి కార్యాలయంలో అందించాలన్నారు. వాటిని పరిశీలించి త్వరగా ఆ ఫైనాన్షియర్లకు మ్యాపింగ్ చేస్తామన్నారు. వాహన యజమానులు తమ వాహన పనులకు సంబంధించివాహన పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పనులు పూర్తికావట్లేదని భావించిన దరఖాస్తుదారులు బుధ, గురువారాల్లో నేరుగా కార్యాలయంలో కలిసి తమ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు.

గండికోటలో గరిష్టస్థాయి నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో గరిష్టస్థాయి నీటిమట్టం 26.8 టీఎంసీలకు చేరుకుంది. దీంతో సోమవారం రాత్రి నుంచి మైలవరం జలాశయానికి 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

ఆర్టీపీపీలో జేఏసీ భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీపీపీ ఉద్యోగులు, కార్మికులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో ఏపీఎస్ ఎస్పీఈ రీజినల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయం ఆర్టీపీపీలోని ఫౌంటేన్ వద్ద ఉన్న వీవీ రెడ్డి, మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. అక్కడి నుంచి ఉద్యోగులు, కార్మికులు, జేఏసీ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీగా ప్లాంట్ గేట్ వరకు వచ్చారు. ఏపీ జెన్‌కో ఉద్యోగ, కార్మికులకు ఉన్న బకాయిలు, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించుట, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్టీపీపీ ఎస్‌ఈ కే.సోమశేఖర్‌రెడ్డికి అందజేశారు.

నూర్పిడి యంత్రాలు పంపిణీ



నూర్పిడి యంత్రాన్ని రైతులకు అందిస్తున్న బ్యాంకు అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం రైతులకు నూర్పిడి యంత్రాలు పంపిణీ చేశారు. స్థానిక జాండీర్ షోరూములో కాన గూడూరు బ్రాంచ్ పరిధిలోని రైతులు నర్సిరెడ్డి, శివకుమార్‌లకు రూ.80లక్షలు విలువ గల నూర్పిడి యంత్రాలు పంపిణీ చేశారు. అనంతరం యంత్రాలకు సంబంధించిన పత్రాలను మెగా కీని వారికి అందజేశారు.ఈ సందర్భంగా ఆ బ్యాంకు రీజనల్ మేనేజరు సార్వోసుశాంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు తమ బ్యాంకు ద్వారా వ్యవసాయ పనిముట్లకు రుణాలు ఇస్తామన్నారు. కడప రీజనల్ మేనేజరు శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఓఎస్డీ అరుణ్‌కుమార్, ఎల్‌డీయం జనార్ధన్, డీఆర్‌డీఏ డీపీయం రఘునాథరెడ్డి, బ్యాంకు సిబ్బంది, షోరూం మేనేజరు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆహార ఉత్పత్తులు

కొండాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడానికి స్థానిక బాలికల గురుకల పాఠశాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా 25 రకాల ఆహార ఉత్పత్తులు పండిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ డీఎంఎంటీ రమణ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో సాగుచేసిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు, పూలమొక్కలకు సోమవారం వేపకాషాయం పిచికారి చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిచడానికి 25 రకాల ఆహార ఉత్పత్తులను పాఠశాల ఆవరణలో మోడల్‌గా పండించడం జరుగుతోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాధవి, సీఆర్పీ సుజాత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చాపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రిపల్లెబస్టాపు వద్ద ప్రొద్దుటూరు, మైదుకూరు జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పఠాన్ ఫక్రుల్లాఖాన్ (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... ఫుల్లారెడ్డినగర్ గ్రామానికి చెందిన ఫక్రుల్లాఖాన్ పక్కగ్రామమైన కేతవరం గ్రామంలో ఉన్న మసీదులోకి ప్రార్థనల కోసం వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తూ రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఆయన తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తండ్రీకొడుకులు

కలసపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సంజీవరాయునిపేట సమీపంలో ద్విచక్రవాహనం, బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లిచూపుల కోసం లింగారెడ్డిపల్లె నుంచి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులు తమ కొడుకుతో కలిసి ద్విక్రవాహనంపై గిద్దలూరుకు సోమవారం వెళ్లారు. మార్గమధ్యలో గిద్దలూరు మండలం సంజీవరాయునిపేట వద్ద వీరి ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్లనూరు నాగేంద్ర, తండ్రి వెంకటసుబ్బయ్యలు తీవ్రంగా గాయపడగా, తల్లి వెంకటసుబ్బమ్మకు స్వల్పగాయా లయ్యాయి. వీరిని వెంటనే నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా నాగేంద్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోలోని పోలీసు లైను సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం రైల్వేగేటు తెరవడంతో వాహనాలు ఒక్కసారిగా అధిక సంఖ్యలో రావడంతో అదుపు తప్పి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘనటలో పెద్దపుత్త గ్రామానికి చెందిన సాయి, కమలాపురానికి చెందిన జఫనాకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డిగ్రీ విద్యాసంస్థల బంద్ విజయవంతం



కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కరస్పాండెంట్లు, విద్యార్థి సంఘ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. సోమవారం కడప నగరంలో పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు మంజూరు చేయాలని కోరుతూ బంద్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. సంధ్యా సర్కిల్ మీదుగా కోటిరెడ్డి సర్కిల్‌కు చేరుకొని అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనివా సులు, సంజీవ్‌రెడ్డి, విద్యార్థి యువజన సంఘాలనేతలు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించండి


కలెక్టరేట్ వద్ద ర్యాలీలో విద్యుత్ ఉద్యోగులు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల న్యాయ మైన సమస్యలు త్వరితగతిన పరిష్క రించాలని విద్యుత్ జేఏసీ ఛైర్మన్ బర్నబాస్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా విద్యుత్ ఉద్యో గులు, కార్మికులు, విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు సోమవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ చేరుకున్నారు. అక్కడ ప్లకార్డులు ప్రదర్శించి సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ర్యాలీగా వెళ్లి కలెక్టరేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ రాష్ట్ర నాయకుడు రామలింగారెడ్డి, జిల్లా కన్వీనరు చల పతి, బ్రహ్మానందరెడ్డి, నాయకులు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై.. లైన్‌మన్‌కు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన లైన్‌మన్ నాగసుబ్బారెడ్డి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైదుకూరు రోడ్డులో మోర్‌సూపర్‌మార్కెట్ పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేస్తున్న లైన్‌మన్ నాగసుబ్బారెడ్డి విద్యుత్‌షాక్ గురై కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి ఆయన మరమ్మతులు చేస్తుండగా మరోలైన్ నుంచి విద్యుత్తు సరఫరా కావడంతో షాక్‌కు గురై పైనుంచి కింద పడ్డాడు. దీంతో తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పక్కనే ఉన్న సిబ్బంది, స్థానికులు అతన్ని అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

ఫుల్లుగా...

- దాబాలు, హోటళ్లలో మద్యం తాగేందుకు సౌకర్యాలు
- పీకలదాకా తాగుతున్న తాగుబోతులు , వాహనచోదకులు
- తరచూ ప్రమాదాలు... పట్టించుకోని అధికారులు

ఖాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ మధ్యకాలంలో మందుబాబులకు ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం దొరుకుతోంది. దీంతో మద్యం ప్రియులు పీకలదాకా తాగి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. రాత్రివేళల్లో అయితే యువత బైకులకు సైలెన్సర్లు తీసి అధిక స్పీడుతో వెళుతూ ప్రమాదాల బారిన పడటంతో పాటు ఇతరులను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ఇక కొందరు తాగుబోతులు నానా హంగామా చేస్తూ రాత్రివేళల్లో నిద్రలేకుండా చేస్తున్నారు. దీనికి కారణం ఇటీవల కొందరు డాబా నిర్వాహకులు మద్యం తాగేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడమేనని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

ఖాజీపేటలో మూడు మద్యం షాపులకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిలో ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. అయితే కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నూరు, మైదుకూరు మధ్యలో గల లాడ్జీల్లో, డాబాల్లో, హోటళ్లలో రాత్రింబవళ్లు మద్యం తాగేందుకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. కూలింగ్ కోసం ఫ్రిజ్‌లు కూడా ఏర్పాటు చేశారు. దీంతో షాపుల్లో మద్యం తీసుకుని అక్కడ కూర్చొని పీకలదాక తాగుతున్నారు. ఇక స్థానికులతో పాటు హైవేలో వెళ్లే వాహన చోదకులు డాబాల వద్ద ఆగి ఫుల్లుగా మందు తాగుతున్నారు. ఆ మద్యం మత్తులోనే వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. దీనిపై ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులకు మామూళ్లు ఇస్తున్నాం వారు మావైపు తొంగి చూడరు.. మా ఇష్టం వచ్చినంతసేపు తాగిస్తాం అని డాబా, హోటళ్ల నిర్వాహకులు ధీమాగా ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ దృష్టికి తీసుకెళ్లగా స్పెషల్‌డ్రైవ్ చేపట్టి.. మద్యం తాగేవారిపై, అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


డాబాలో మద్యం తాగుతున్న మందుబాబులు


సుండుపల్లె: బాల త్రిపుర సుందరిగా వాసవి


లక్కిరెడ్డిపల్లెలో సర్వ మంగళాదేవి..


చిట్వేలిలో భద్రకాళి అమ్మవారు..


నందలూరు: దీక్షాబంధన అలంకారంలో కన్యకాపరమేశ్వరి


రాజంపేటలో వీరచౌడేశ్వరి


ఒంటిమిట్టలో.. వాసవీ మాత ..


రాయచోటి: దీక్షా బంధన అలంకారంలో ఉమాదేవి

దీక్షా బంధన అలంకారంలో జగన్మాత

మూడు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులను అనుగ్రహించారు.

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు భద్ర కాళి అలంకరణలో, కన్యకా పరమే శ్వరి ఆలయంలో అమ్మవారు వాసవాంబగా, కొత్తపేట రామాపురంలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు చౌడేశ్వరిగా, పాత రాయచోటిలోని అగస్త్యేశ్వరాలయంలో దాక్షాయణి పార్వతీదేవి అలంకారంలోభక్తులకు దర్శనమిచ్చారు.

రాయచోటి-నేతాజీ సర్కిల్: ఎస్ఎన్‌కాలనీ చెక్‌పోస్టు సమీపంలో ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చారు.

రాజంపేట : రాజంపేట పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం తెల్లవారు జామున . గణపతిపూజలతో నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం కన్యకాపరమేశ్వరి, వీరచౌడేశ్వరి, సాదుకామాక్షమ్మ, ఉదయగిరి యల్లమ్మ అమ్మవార్లు దీక్షాబంధన అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చారు. మంగళవారం పార్వతి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్ తెలిపారు.

చిట్వేలి : స్థానిక కన్యకాపరమేశ్వరి, ఆలయంలో అమ్మవారు దీక్షా బంధన అలంకారం, పాత చిట్వేలిలోని భద్రకాళి సమేత వీరభద్రా లయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక కొత్తకొట్టాలులోని సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరి గా అలంకరించారు.

గాలివీడు :మండలంలోని పసుపులవాండ్లపల్లెకు సమీపంలో ఉన్న ఆలయంలో సోమవారం అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా ప్రజలకు దర్శనమిచ్చారు.

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ సాయినగర్‌లో సమర్థ సద్గురు దర్గా మాతాజీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చింది.

సుండుపల్లె : మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆల యంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దీక్షా బంధన అలంకారంలో దర్శనమిచ్చారు.

పెనగలూరు : వినాయకనగర్‌లో సోమవారం రాత్రి దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బాలా త్రిపుర సుందరి అలంకారంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

తెగిపోయిన చెరువులను పునరుద్ధరించాలి

సుండుపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాచంవాండపల్లె ఎగువ భాగంలో బైరాన్‌చెరువు, పెద్దినేనికాలువ పంచాయతీలోని మాణ్యంవారి పల్లి సమీపంలో అయ్యవారిచెరువుల మొరవలు తెగిపోయి భారీ నష్టం వాటిల్లిందని, చెరుకు వాండ్లపల్లె సమీపంలో కాజ్‌వే తెగిపోవడంతో రోడ్లు కొట్టుకుని పోయి సుమారు 60 గ్రామాల ప్రజలకు నాలుగు రోజుల పాటు రవాణా స్తంభించిపోయిందని జనసేన పార్టీ నాయకుడు రామాశ్రీనివాసులు మండల నాయకులతో కలిసి సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యుద్ధ ప్రాతిపదికన నివేదికలు సిద్ధం చేసి తెగిపోయిన చెరువుల మొరవలను బాగు చేయాలని విన్నవించారు.

కృష్ణారెడ్డి చెరువు నిండి పోవడంతో గుట్టకిందరాచపల్లి, నాయునివారిపల్లె ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

పింఛా ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలిన పుడల్లా మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ రాచపల్లి దిగువన చిన్నబిడికి ప్రాంతంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ ప్రాంతంలో హైలెవెల్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరారు.


జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జనసేన నేత రామాశ్రీనివాసులు

పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని 13 గంటల పనిదినంగా మార్చే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం రాయచోటి పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపింగ్ మాల్స్, పారిశ్రామిక కేంద్రాల్లో మహిళలకు రాత్రి డ్యూటీల నిర్ణయం మంచిది కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, అందులో భాగంగానే శుక్రవారం అసెంబ్లీలో 8 గంటల పనిదినాన్ని 13 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక ఉద్యోగం వర్గాలు పోరాడుతాయని హెచ్చరించారు. . ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చే:శారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. జయన్న, వనజ, చెన్నయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : రాష్ట్రంలో కార్మికులకు పని గంటలు పెంచుతూ రాష్ట్ర శాసనసభ ఆమోదించడం కార్మికులకు తీరని ద్రోహం చేయటమేనని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మాదరాజు గంగాధర్ తీవ్రంగా విమర్శించారు. అందుకు నిరసనగా మంగంపేట కార్మికవాడలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి, ఏఐటీయూసీ త్రివేణి కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, వెంకటరమణ, వరప్రసాద్, నరసింహులు, అలాగే కార్మికులు పాల్గొన్నారు.


సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్మికులు

మండలాన్ని అభివృద్ధిపథంలో నడుపుదాం


రాచపల్లిలో జగన్‌మోహన్ రాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండలాన్ని అభివృద్ధిపథంలో నడుపుతామని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం మండలంలోని రాచపల్లిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గ్రామీణ రోడ్లు ప్రజలకు తాగునీరు, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్వీ రమణ, మండల నాయకులు పత్తి సుబ్బరాయుడు, ఎంవీ రమణ, సుధాకర్‌రాజు, మండల మాజీ ఉపాధ్యక్షుడు నామాల వెంకటయ్య, తుమ్మలకుంట ఈశ్వరయ్య, గజ్జల శ్రీనివాసులరెడ్డి, బీజేపీ నాయకుడు పాటూరు గంగిరెడ్డి, శివారెడ్డి, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా శుభాకాంక్షల పోస్టర్ విడుదల

రాజంపేట టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి పాండురాజు రూపొందించిన దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసే పోస్టర్లను స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

నందలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తమను విధుల్లోకి తీసుకోవాలంటూ గ్రామ వలంటీర్లు సోమ వారం ఈవోపీఆర్డీ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం తమను విధుల్లోకి తీసుకుని, గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.సాయిక్రిష్ణ, శివకోటి, సురేంద్ర, సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్, సుధీర్‌కుమార్, మకుద్‌బాషా, అయూబ్ పాల్గొన్నారు.


ఈవోపీఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో ప్రత్యేక కార్యక్రమాలు

పెనగలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలు అభ్యసిస్తున్న చిన్నారుల కోసం సమగ్ర సెషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో నిర్మలజ్యోతి తెలిపారు. సోమవారం బుట్టిరెడ్డిగారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త గంగాద్రి అధ్యక్షతన ఆటలు పాటలు సంభాషణ ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. కథలు, బొమ్మల సహాయంతో చిన్నారుల అభ్యాసాన్ని సులభంగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. సూపర్‌వైజర్‌లు వసుంధరమ్మ, సురేఖరాణి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నిర్మలజ్యోతి

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ

రాయచోటి టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం విద్యుత్‌శాఖ కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఐక్యపోరాట వేదిక ఏర్పాటు చేసుకొని ఈ నెల 17 నుంచి ఆందోళన చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మదనపల్లి, రాజంపేట, పీలేరు, రాయచోటి డివిజన్లలోని విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు 500 మందితో విద్యుత్ జేఏసీ అన్నమయ్య సర్కిల్ చైర్మన్ సయ్యద్ జాఫర్‌వలి, కన్వీనర్ నరసింహులునాయక్, బాలునాయక్‌ల అధ్యక్షతన శాంతియుత ర్యాలీ నిర్వహించి జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ నరేంద్రనాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్డెప్ప రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు, కార్మికులు

ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎంగా నిరంజన్‌కుమార్

రాజంపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డీపీటీవో ఉత్తర్వుల మేరకు రాజంపేట ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్‌గా నిరంజన్‌కుమార్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం బద్వేల్ డిపో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల రాజంపేట డిపో మేనేజర్ పెట్రోల్ బంకు అవినీతి కేసులో సస్పెన్షన్‌కు గురైన విషయం విదితమే...

డీఏ బకాయిలు విడుదల చేయాలి

● రూటా రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ హసీం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రూటా రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ హసీం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేసి ఐఆర్ ప్రకటించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్‌హసీం డిమాండ్ చే:శారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని రూటా సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో యునాని వైద్యకళాశాల పనులను ప్రారంభించాలని కోరారు. అనంతరం రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలోని అన్ని ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసి ఉర్దూ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని పట్టణ, నగర శివారుల్లో ఏర్పాటైన నూతన కాలనీల్లో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రూటా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సిబాతుర్‌రెహ్మాన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ డైట్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని, డెప్యుటేషన్ ప్రాతిపదికన అర్హులైన ఉర్దూ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రూటా రాష్ట్ర నాయకులు అసదుల్లాబాషా, జిల్లా నాయకులు జాఫరుద్దీన్, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్‌లు


రైతులకు కిసాన్ డ్రోన్స్ అందిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్స్ రైతులకు అందిస్తోందని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్ఎండీ డాక్టర్ షఫీనాయక్ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యా లయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో స్ప్రింక్లర్లు డ్రోన్స్ అందిస్తోందన్నారు. డ్రోన్స్ కావాల్సిన ప్రతి రైతు వ్యవసాయ అధికారిని సంప్రదించాలని తెలియజేశారు. బ్యాంకులు కూడా 80 శాతం సబ్సిడీతో డ్రోన్స్ అందిస్తాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏవో రాజకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డులు సద్వినియోగం చేసుకోవాలి


స్మార్ట్ రేషన్‌కార్డులతో టీడీపీ నేతలు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె మండల టీడీపీ ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్ అన్నారు. సోమవారం 10 చౌక దుకాణాల డీలర్ అన్వర్ సమక్షంలో స్మార్ట్‌ల కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌యండీ షఫీనాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకట్రామరాజు, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు మండ్ల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్కో ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

చిన్నమండెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ, ఇఫ్కో సహకార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ సమావేశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి నానో ఎరువులు, జీవన ఎరువులు వాడాలని సూచించారు. అధిక యూరియా వాడకంతో పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ఇఫ్కో జిల్లా అధికారి నానో యూరియా, నానో డీఏపీ వాడే విధానాన్ని తెలియజేశారు. మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత మాట్లాడుతూ మండలంలో అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేశామన్నారు. ఇంకా ఇండెంట్ పెట్టి రెండు రోజుల్లో ఇస్తామని తెలియజేశారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష తప్పదని రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అనంతరాజుపేటలో ఉన్న ఉద్యాన కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడరాదని తెలిపారు. ఉద్యాన కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మకు 'కస్తూరి' పూజలు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెం బరు 22(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల సందర్భంగా సో మవారం కోడూరు పట్టణం బలిజ వీధిలోని గంగమ్మను రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు దంపతులు, వార్డు సభ్యులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో దేశ భక్తి

నందలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశం అభివృద్ధి చెందడానికి ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు అనేక కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.. సోమవారం స్థానిక అరుంధతివాడలో నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ పి.నీలవేణి మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావడం, డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను పాటించడం వంటి లక్షణాలు విద్యార్థులకు అలవడి ఉత్తమ పౌరులుగా రూపుదిద్దుకుంటారని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వసంతరావు, వెంకటేశ్వర్లు,

దివ్యాంగ బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్థులు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి సందర్భంగా టపాసులు పేల్చుతూ చెయ్యి కోల్పోయిన బాలుడి కుటుంబానికి గ్రామస్థులు ఆర్థిక సహాయం అందజేశారు. కొత్త మంగంపేటలో వినాయకచవితి పండుగ సందర్భంగా చేతిలోనే టపాసు పేలిపోవడంతో రంజిత్‌కుమార్ ఎడమచేయికి తీవ్ర గాయమైంది.. పరీక్షించిన వైద్యులు అతని చేతిని మణికట్టు వరకు తొలగించారు. ఈ ఘనటకు నెల ముందు బాలుడి తండ్రి ప్రమాదంలో ఒక కాలు కోల్పోయాడు. ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉండడాన్ని గమనించిన గ్రామస్థులు విరాళాల ద్వారా సేకరించిన రూ.56 వేలు ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

రాయచోటిలో పోలీసుల తనిఖీలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు, బంగ్లా సర్కిల్, ఠాణా సర్కిళ్లలో పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ సాయంతో తనిఖీలు నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్ సాయంతో అనుమానాస్పద వస్తువులను తనిఖీ చేశారు. రద్దీ ప్రదేశాల్లో ప్రత్యక్ష పహారా నిర్వహించి ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు. నేరాల నివారణతోపాటు, ప్రజల్లో అప్రమత్తత పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినపుడు వెంటనే సమాచారమందించాలని సూచించారు.

త్రైలోక్య రూపిణీ నమోస్తుతే....

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం ● ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణలు

మదనపల్లెలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ ● భక్తిశ్రద్ధలతో లలితాదేవి కుంకుమార్చన



బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో పోలేరమ్మతల్లి (గుర్రంకొండ)

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో మొదటి రోజు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. ఎంతో మహిమాన్వితమైన శ్రీబాలామంత్రం సమస్త దేవీమంత్రాల్లో అత్యున్నతమైనది. భక్తులకు పూర్ణ ఫలం అందించే బాలాత్రిపురసుందరీ దేవి చతుర్భుజాలతో, జపమాల, పుస్తకం ధరించి, అభయ, వరద హస్తాలతో త్రైలోక్య రూపిణీగా దర్శనం కల్పించారు. ఉపాసకులు త్రిపురసుందరీదేవి అనుగ్రహం కోసం బాలార్చన, 'లలితా త్రిశతి' పారాయణ చేస్తారు.

రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులను కరుణించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి బాలా త్రిపురసుందరీదేవిగా రూపుదిద్దారు. భక్తులకు తీర్థ, అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.



కన్యకాపరమేశ్వరి అలంకరణలో అమ్మవారు(పీలేరు)







బి.కొత్తకోటలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు - మదనపల్లెలో విద్యుత్ దీపాలతో అలంకరణ చేసిన బాట గంగమ్మ ఆలయం - ప్రత్యేక అలంకరణలో అమ్మవారు (ములకలచెరువు)

మదనపల్లెలో....

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం దేవతా నగర్‌లోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. వాసవీభవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరీ దేవిని అభిషేకించి, విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవారిని హంసవేణిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. కోర్టులో గంగమ్మ ఆలయంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెరవలి వేణుగోపాల్ నాయుడు, మార్పూరి ప్రభాకర్ నాయుడు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పసుపు అలంకరణ చేసి అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో ఈఓ రమణ ఆధ్వర్యంలో మూలవర్లకు విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనోజ, కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్ తులసి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, పూజలో పాల్గొన్నారు. సిబ్బంది అంకన్న, రాజశేఖర్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా కమ్మగడ్డవీధిలో నాదెళ్ల అరుణ్‌తేజ్ మిత్రబృందం దుర్గమ్మను ప్రతిష్ఠించారు. 12 ఏళ్లుగా ఇక్కడ దుర్గమ్మను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం ఆనవాయితీ. దసరా నుంచి 10 రోజులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు చెప్పారు. ఐదు దుర్గమ్మ విగ్రహాలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రశాంత్‌నగర్‌లో యువకులు దుర్గ మాతను నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. పది రోజులు అమ్మవారికి పూజలు చేసి అనంతరం పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేస్తారు.

బి.కొత్తకోటలో వైభవంగా...

బి.కొత్తకోట,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయదశమి వేడుకల్లో భాగంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన బి.కొత్తకోటలో వైభవంగా జరిగింది. అమ్మవారిశాలలో నిర్వహించే దసరా ఉత్సవాలకు భిన్నంగా ఈ ఏడాది దసరా ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించేందుకు బి.కొత్తకోట యువకులు కమిటీగా జ్యోతిసర్కిల్‌లో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జ్యోతిసర్కిల్ యావత్తూ విద్యుత్ దీపాల వెలుగులో మెరిసిపోయింది. నవరాత్రి ఉత్సవాలు పదిరోజులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి బాట గంగమ్మ ఆలయంలో...

నేటి నుంచి బుగ్గవంక కాలువ సమీపంలోని, నాదెళ్లనారాయణస్వామి కాలనీలో బాట గంగమ్మ ఆలయంలో శన్నవరాత్రుల ఉత్సవాలు, ఆలయ 8వ వార్షికోత్సవాలు జరుగుతాయని ధర్మకర్త బొగ్గిటి అలివేలమ్మ తెలిపారు. 23న బాటగంగమ్మ, 24న మహాలక్ష్మీ, 25న శాకాంబరీ, 26న ధనలక్ష్మీ, 27నపార్వతీదేవి, 28న సరస్వతీదేవి, 29న దర్గాదేవి, 30న మహిషాసురమర్ధిని, అక్టోబరు 1న రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో పూజలు జరుగుతాయన్నారు. అక్టోబరు 10న ఆలయంలో అన్నదానం జరుగుతుందని చెప్పారు.

తంబళ్లపల్లెలో....

తంబళ్లపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల ఆలయాల్లో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పసుపుతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీటీఎం రోడ్డులో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని నల్లవీరగంగా భవాని ఆలయం, కోనేటి వీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, వాల్మీకినగర్‌లోని బోయకొండ గంగమ్మ ఆలయం, గండబోయన పల్లె సత్యమ్మతల్లి ఆలయాల్లో అమ్మవార్లకు బాలాత్రిపుర సుందరీదేవి, చింతపర్తిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీమాత్రేదేవి, గొల్లపల్లెలోని విరూపాక్షమ్మ తల్లి ఆలయంలో కాశీవిశా లాక్షిదేవి అలంకరణలు చేసి విశేష పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారి దేవాలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. కార్యక్రమాల్లో ఆలయాల ధర్మకర్తలు మొర్రం రెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, పులి సత్యారెడ్డి, కాంత రాజు శెట్టి, కువైట్ శంకరాచారి, అర్చకులు గోన వరపు శీనాస్వామి, జనార్ధన్‌స్వామి, ఉత్తన్న స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లలితాదేవి కుంకుమార్చన

పీలేరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో మొదటి రోజు బాలా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. రాత్రి లలితాదేవి కుంకుమార్చన భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి, చిత్తూరు మార్గంలోని అమ్మవారి ఆలయంలో, శివాలయంలోనూ నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.



హంసవేణి అలంకరణలో కన్యకాపరమేశ్వరీ దేవి (మదనపల్లె)

బాలాత్రిపురసుందరిగా యల్లమ్మ

కలికిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో తీర్చిదిద్దారు. అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు పూర్తి చేసి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఆలయ నిర్వహ కులు రెడ్డివారి అశోక్‌కుమార్ రెడ్డి భక్తులకు సౌకర్యాలను కల్పించారు. పార్వతీ సమేత సోమేశ్వరాలయంలో పార్వతీదేవిని సాక్షాత్తు మహిషాసురమర్ధినిగా భక్తులకు కనువిందు చేశారు. బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారీ, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండేశ్వరీ సప్తమాతృకలు అమ్మవారి చుట్టూ ఆశీనులు కాగా మహిషాసురమర్ధినిగా పార్వతీదేవి ఆగ్రహోదగ్రులై మహిషాసురిడిని వధిస్తూ భక్తులకు అభయం కలిగించారు. వేద మంత్రాల మధ్య మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకుడు పుల్లారెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందు బాటులో ఉంచారు.



పసుపు అలంకరణలో కోర్టులో గంగమ్మ (మదనపల్లె)

బి.కొత్తకోట చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలి



కానగలకుంటను పరిశీలిస్తున్న హంద్రీ-నీవా అధికారులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ తాగునీటి అవసరాలను తీర్చే కానగలకుంట, పెద్ద చెరువులను హంద్రీ-నీవా నీటితో నింపి పట్టణ ప్రజలను ఆదుకోవాలని బీజేపీ నేతలు ఉన్నతాధికారులను కోరారు. పట్టణశివారులోంచి వెళుతున్న కృష్ణాజలాలను ఈ చెరువులకు తరలించి నింపితే భూగర్భజలాలు అభివృద్ధి చెంది ప్రభుత్వ తాగునీటి పథకాలు పనిచేస్తాయని పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా పోతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా ఏఈ ఆంజనేయులు కానగలకుంటను పరిశీలించారు. హంద్రీనీవా జలాలతో చెరువులను నింపడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. బీజేపీ నేతలు ముకుందబాబు, బండి కార్తీక్, గోరంట్లరమేష్, మురళి, రాంకుమార్, నాగరాజు, రెడ్డిమోహన్ పాల్గొన్నారు.

కోళ్ల ఫారాలు మూసి మా ప్రాణాలను కాపాడండి

● ఎంపీడీఓకు గ్రామస్తుల వేడుకోలు



ఎంపీడీఓ రమేష్‌కు తమ గోడును వివరిస్తున్న పిట్టావాండ్లపల్లి గ్రామస్తులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారి పల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి సమీప కోళ్ల ఫారాల నుంచి వచ్చే ఈగలు, వాసనతో భరివించలేక పోతున్నామని దాదాపు వంద మంది గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓ రమేష్‌కు తమ గోడును విన్నవించారు. దాదాపు 15ఏళ్ల కిందట గ్రామ సమీపంలో కోళ్ల ఫారాలు వెలిశాయని అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు కోళ్ల వ్యర్థాలు, ఈగలు, వాసనలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. చనిపోయిన కోళ్లను గ్రామ సమీపంలో వేయడంతో కుక్కలు తెచ్చి గ్రామంలో వేస్తున్నాయని, కోళ్ల వ్యర్థాలపై వాలిన ఈగలు తాగునీటిలో కలిసి జ్వరాల భారిన పడుతున్నామని వర్షాకాలం వస్తే కోళ్ల వ్యర్థాలు నీటి పారుదలతో గ్రామంలోకి వస్తున్నాయని తెలిపారు. ఈగల వలన తమ చిన్న పిల్లల జ్వరాలతో భాధపడుతుంటే నిత్యం ఆస్పత్రులకు తిరుగుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న బోజనంలో ఈగలు పడుతూ పిల్లలు తినేసమయంలో కూడా ఈగలు వాలుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు పలు మార్లు సంబంధిత అధికారులకు తమ బాధను విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పక్షం రోజుల కిందట కోళ్ల ఫారాల యజమానులకు నోటీసులు ఇచ్చామని వారు నాసిరకం ఈగల మందు కొట్టడంవలన సమస్య మొదటికి వచ్చిందన్నారు. మంగళవారం కోళ్ల ఫారాలను మూసివేసి ప్రజలకు న్యాయం చేస్తాయని తెలిపారు. స్వాతి, భూదేవి, ధనరాజ్, భారతమ్మ, సరోజ, జ్యోతి, భవాని, దేవి నారాయణ, గంగాధర్, రామచంద్ర, జగదీష్, కేశవ, సురేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

పీలేరు కళాకారుడికి నందీశ్వర అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎర్రయ్య

పీలేరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన ప్రముఖ సంగీత విద్యాంసులు అసనాపురం ఎర్రయ్య సంగీత కళా నందీశ్వర అవార్డు అందుకున్నారు. విజయవాడలోని శ్రీ వాగ్దేవి సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ విజయవాడలో ఆదివారం నిర్వహించిన వేడకల్లో ప్రముఖ సినీ నటులు శుభలేక సుధాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న ఎర్రయ్యను సోమవారం పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం చైర్మన్ ఎల్లమంద రావు, గాజువాక ఎమ్మెల్యే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసినందున గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ హరినారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టి జ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బురకాయలకోట -2లోని అంగన్‌వాడీ కేంద్రానికి తక్షణం తాగునీటి పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చి నీటి వసతి కల్పించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చక్రపాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దినేష్‌కుమార్, ఎంఈఓ వెంకటరమణ, ఎపీఓ నారాయనస్వామి, ఎపీఎం మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప తరలింపు...?

గుర్రంకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో కంప చెట్లను కలప వ్యాపారులు నరికేస్తున్నారు. దీన్ని బయటికి తరలించి బొగ్గు తయారు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సర్కార్, సంద్ర చెట్లును ఇష్టానుసారంగా వ్యాపారులు నరికేస్తున్నారు. ఈ క్రమంలో కంప కలపను ఓ చోట డంప్ చేసి గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లలో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. చెర్లోపల్లె పంచాయతీ పరిధిలోని దద్దాలవారిపల్లెకు సమీపంలో డంప్ చేసిన కలపను సోమవారం వ్యాపారులు ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలించారు. కలప వ్యాపారులు నిబంధనలు తుంగలో తొక్కి అక్రమంగా కంప కలపను బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

27లోగా స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను 27లోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసింస్టెట్‌లు సర్వేయర్లతో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నాలుగు పంచాయతీల్లో సర్వే పూర్తి కాగా మిగిలిన పంచాయతీ సిబ్బంది త్వరగా పూర్తి చేయాలన్నారు.

రామసముద్రంలో వర్ష బీభత్సం



నేలకొరిగిన బీన్స్ పంట

రామసముద్రం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామసముద్రం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి నీరు చేరడంతో సిబ్బంది రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. దిన్నిపల్లె సమీపంలోని గాంధీనగర్ వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వర్షాలకు కాలిఫ్లవర్, కొత్తమీర, టమోటా, బీన్స్, పంటలు దెబ్బతిన్నాయి. శని, ఆదివారం రాత్రి కురిసిన గాలీవానకు బీన్స్ పంట నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన పంటలు నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

ములకలచెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు పెద్ద చెరువు నిండడం, మొరవపోతుండడంతో నీట మునిగిన మొక్కజొన్న, టమోటా పంటలను ఏఓ స్రవంతి, హార్టికల్చర్ ఆఫీసర్ వేరుగా పరిశీలించారు. బిళ్లారివారిపల్లె వద్ద నీట మునిగిన వంకాయ, బెండకాయ తోటలను కూడా ఏఓ పరిశీలించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.


పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులు



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు, అధికారులు

పీలేరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ప్రవేశపెట్టిందని రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి, పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి అన్నారు. బ్రాహ్మణ వీధి, సదుం రోడ్డు, బండ్లవంక ప్రాంతాల్లోని చౌకదుకాణాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. రేషన్ పంపిణీలో అవకతవకలు కట్టడి చేయడానికి స్మార్ట్ రేషన్ కార్డుల వ్యవస్థ తోడ్పడుతుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల్లో రాష్ట్ర అధికారిక ముద్ర ప్రవేశ పెట్టారన్నారు. సీఎస్ డీటీ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండంలోని 56 చౌకదుకాణాల పరిధిలో ప్రస్తుతం 21,009 కార్డులు ఉండగా, వాటి స్థానంలో కొత్త స్మార్ట్ కార్డులు అందిస్తామన్నారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు అప్రూవల్ అయిన రేషన్ కార్డులకు ప్రస్తుతం స్మార్ట్ కార్డులు అందిస్తామని, ఆ తరువాత అప్రూవల్ అయిన వారికి డిసెంబరు 25వ తేదీన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు లడ్డూ జాఫర్, కోటపల్లె శ్రీనాథరెడ్డి, షామియాన జయన్న, షౌకత్ అలీ, చాన్ బాషా, నరేశ్, రెడ్డి ముని, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



ప్రజల సమస్యలపై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మూడు గ్రామాల ఆలయాల భూములను కొందరు రైతులు ఆక్రమించుకుని, ఆలయానికి వెళ్లే దారిని కూడా కబ్జా చేస్తున్నారని ఎద్దులవారికోట గ్రామస్థులు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో గ్రామస్థులు తమ సమస్యను సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. భూసేకరణలో నష్టపరిహారం చెల్లించలేదని, భూ వివాదాలపై సర్వే చేయడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారని, 22ఏ దరఖాస్తులను అసలు విచారించడమే లేదని పలువురు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పొలాలకు దారి సమస్య, మ్యుటేషన్ సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు. వీటిని విచారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆయా ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు సబ్‌కలెక్టర్ సూచించారు. ^ఏఓ నిర్మలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న బైక్

గుర్రంకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు గుర్రంకొండ వాసి అహ్మద్ సోమవారం వేకువజామున బైక్‌లో రాయచోటి నుంచి గుర్రంకొండకు బయలుదేరాడు. చిట్టిబోయినపల్లె వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని అహ్మద్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాధితుడికి తీవ్ర రక్తగాయాలు కావడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వాల్మీకిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సమతుల ఆహారంతోనే సంపూర్ణారోగ్యం సాధ్యమని చింతపర్తి పీహెచ్‌సీ డాక్టర్ సాయిశ్రీ పేర్కొన్నారు. చారావాండ్లపల్లెలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అవగాహన చేపట్టారు. పౌష్టికాహారం, జీవనశైలి, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. శిశువులకు టీకాలు, గర్భిణులకు వైద్య పరీక్షించి పౌష్టికాహారం పంపిణీ చేశారు. సీహెచ్ఓ అరుణ, డిప్యూటీ హెల్త్‌ఎడ్యుకేషన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

రెడ్డి జాగృతి బెంగళూరు రూరల్ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున రెడ్డి



తంబళ్లపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రెడ్డి జాగృతి బెంగళూరు రూరల్ జిల్లా అధ్యక్షుడిగా తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె పంచాయతీ చెరువుముందరపల్లె వాసి నల్లగుండ్ల మల్లికార్జున రెడ్డి నియమితులయ్యారు. రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టింగారి మాధవరెడ్డి సోమవారం నియామక ఉత్తర్వులు ఇచ్చారు. మల్లికార్జునరెడ్డి తంబళ్లపల్లె, బెంగళూరులో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ గుర్తింపు పొందారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని రేషన్ షాపుల్లో స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి నేతలు పంపిణీ చేశారు. కందుకూరు షాపు నంబర్ 22లో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు వై. పణిరాజ్, కే. నాగరాజు, దండు రెడ్డిబాష, ఎం. సుబ్బయ్య, ఎస్ హైదర్, బుడ్డా క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

25న రౌండ్ టేబుల్ సమావేశం

పీలేరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 25న రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంఆర్‌పీఎస్ నేత నడిమికండ్రి సుధాకర్ తెలిపారు. మదనపల్లెను జిల్లాగా చేయడమే కాకుండా పీలేరు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చాలని కోరుతూ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు చిత్తూరు రోడ్డులోని మూన్‌లైట్ హోటల్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి పీలేరు ప్రజలు అత్యధికంగా హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాగునీటిసమస్య తీర్చాలని వినతి

బి.కొత్తకోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని బద్దిపల్లి వాసులు కమిషనర్ జీవీ పల్లవికి విన్నవించారు. సోమవారం మహిళలు నగర పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి పథకం నీట మునగడంతో పనిచేయకుండా పోయిందని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

గుండ్లూరు చెరువు ఆక్రమణ

కలికిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుండ్లూరు గ్రామం గల్లావారిపల్లెకు ఎగువభాగంలో వున్న చిన్నఅయ్యలకుంట చెరువులో స్థానిక రైతు ఐదెకరాలు ఆక్రమించి సాగుచేస్తున్నాడని వెంకటేశ్వర రెడ్డి కలెక్టరుకు ఫిర్యాదు చేశాడు. రాయచోటిలో జరిగిన ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో ఆయన ఈ ఫిర్యాదు అందజేశారు. చెరువులో నీరు కారణంగా పంట దెబ్బతింటుందని నీరు వెళ్లిపోయేలా కాల్వ తవ్వించాడని ఆరోపించారు. తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకుని కాపాడాల్సిందిగా ఆయన కలెక్టరును కోరారు.

దారిద్ర్యం

దుస్థితిలో చెరువుకిందపల్లె దారి ● ఉన్న కాజ్‌వే కొట్టుకుపోయిన వైనం



చెక్ డ్యాం పక్కన గండి పడ్డంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



రాళ్లు రప్పలతో నిండి ఉన్న చెరువుకిందపల్లె దారి



నీటి ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే

పీలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తరాలు మారుతున్నా ఆ గ్రామం తలరాత మారడం లేదు. ఆధునిక యుగంలోకి అడుగు పెట్టినా ప్రధాన రహదారికి అనుసంధానం లేక తిప్పలు పడుతున్న కుగ్రామం అది. మండల కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ప్రధాన రహదారికి చేరుకోవాలంటే వాగు దాటాల్సిందే. పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి, భూస్వాముల పెత్తందారీతనానికి కేవీపల్లె మండలం ఎంపీపల్లె పంచాయతీ చెరువుకిందపల్లె సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. 25 దళిత కుటుంబాలు నివసిస్తున్న ఆ గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేక రాళ్లు రప్పలతో నిండిన దారిలో నడుస్తున్నారు గ్రామస్తులు. పగలు ఎలాగోలా సర్దుకుపోతున్నా రాత్రిళ్లు ఏదైనా ప్రాణాపాయం సంభవించినప్పుడు తమ అవస్థలు పగవాడికి కూడా వద్దంటూ వాపోతున్నారు.

108 వాహనం కూడా రాదు

ప్రధాన రహదారి నుంచి ఇంటికి చేరాలంటే ఆటోలకు రూ.150 నుంచి రూ.200ల దాకా చెల్లిస్తున్నామని, రాత్రిళ్లు అయితే అవి కూడా ఉండవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణం మీదకు వస్తే 108 వాహనం కూడా తమ గ్రామంలోకి రాదని అంటున్నారు. గ్రామం ఆవిర్భవించిన నాటి నుంచి దారి సౌకర్యం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని, రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్న తమను ఇప్పటికైనా పట్టించుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాగు దాటాల్సిందే

ఎంపీ పల్లె పంచాయతీ పరిధిలోని చెరువుకిందపల్లె దళితవాడ నుంచి పీలేరు-సుండుపల్లె రోడ్డు మీదకు రావాలంటే గ్రామ సమీపంలో ప్రవహించే వజ్రాల వంక దాటాల్సిందే. గ్రామం చుట్టూ ఇతర గ్రామాలకు చెందిన వారి భూములు ఉండడంతో వారు దారి కోసం స్థలం ఇవ్వడానికి ఒప్పుకోలేదు. దీంతో చెరువుకిందపల్లె గ్రామం నుంచి వజ్రాల వాగు వద్దకు చేరుకోవాలంటే పొలాల మధ్య నుంచే నడుచుకుంటూ వెళ్లాలి. రాళ్లు రప్పలతో నిండిన ఆ దారిలో నడవడానికి చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల నుంచి తిరిగి వచ్చే విద్యార్థులు, పనుల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లే వారు ప్రతిరోజూ రాత్రివేళ ఆ దారిలో రావాలంటే గాయాల పాలవుతున్నారని వారు తెలిపారు. చెరువుకిందపల్లె దళితవాడలోని అందరూ వ్యవసాయ కూలీలు కావడంతో వారంతా భుక్తి కోసం బయటి ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి.

కొట్టుకుపోయిన కాజ్‌వే

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకిందపల్లెకు, పీలేరు, సుండుపల్లె రహదారికి అనుసంధానంగా ఉన్న వజ్రాల వంక కాజ్‌వే నాలుగు రోజుల క్రితం కొట్టుకుపోయింది. దీంతో చెరువుకిందపల్లె గ్రామం నుంచి రాకపోకలు ఆగిపోయాయి. విద్యాసంస్థలు, పనులకు పోకుండా ఆ గ్రామస్తులు రెండు రోజులు పూర్తిగా గ్రామంలోనే ఉండిపోయారు. వజ్రాల వంక ఉధృతి తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి కొంత మంది మహిళలు, యువకులు గ్రామం వెలుపలికి వచ్చారు. వజ్రాల వంకపై నిర్మించిన చెక్ డ్యాం పక్కన గండి పడడంతో నీటి ప్రవాహం పెరిగి కాజ్‌వే కొట్టుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు కోసం తరతరాలుగా వేడుకోలు

తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామం ఏర్పడిన నాటి నుంచి అనేక మంది పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు అందించి విసిగిపోయామని గ్రామస్తులు తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చేవారు రోడ్డు ఏర్పాటు చేస్తామని పలుమార్లు హామీలు గుప్పించినా అవి నీటి మూటలుగానే మిగిలిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామంలో ఎవరికైనా ప్రాణం మీదకు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం 108 వాహనం కూడా తమ గ్రామంలోకి వచ్చే అవకాశం లేదని వారు వాపోయారు.

ప్రతిపాదనలు పంపాం

- సుధాకర్, ఎంపీడీవో, కేవీపల్లె

చెరువుకిందపల్లె వద్ద కాజ్‌వే కొట్టుకుపోయిన సమాచారం అందగానే ఇరిగేషన్ శాఖాధికారులను అప్రమత్తం చేశాం. వారిని అక్కడకు పంపి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయమన్నాను. తక్షణ మరమ్మతుల కోసం రూ.10 లక్షలు అవుతుందని వారు తేల్చారు. ఆ ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపాం. అక్కడి నుంచి నిధులు, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. కాజ్‌వేను పునరుద్ధరించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న దారి సమస్య కూడా పరిష్కరిస్తాం.

ఆ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

రాయచోటి కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో చనిపోతున్న న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజు ఉదయం కోర్టు పని గంటల్లో సంతాపాన్ని తెలిపే సంస్కృతిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేయడాన్ని ఖండిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం 10.30 గంటలకు రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యులు ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధనతో కలిసి విధులు బహిష్కరించడానికి కారణాలను తెలియజేశారు. అనంతరం కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి బాషా మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ కారణాలతో చనిపోయిన న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజున ఉదయం 10.30 గంటలకు కోర్టుకు హాజరుకాగానే సంతాపాన్ని తెలియజేసే సంస్కృతి ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిందన్నారు.

వెనక్కి తీసుకోవాలి: ఐఏఎల్ డిమాండ్

న్యాయవాదుల సంతాప కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు కాకుండా సాయంత్రం సమయంలో జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సర్క్యులర్ ఇవ్వడం బాధాకరమని, ఈ సర్క్యులర్‌ను తక్షణం వాపసు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఎం.ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఉన్న సంస్కృతిని రద్దు చేయడం అంటే న్యాయవాదులందరినీ అవమానించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కూలీలు?

సుండుపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న 9 మంది కూలీలను అన్నమయ్య జిల్లా రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. మండలంలోని రాయవరం అటవీ ప్రాంతంలోనికి ఎర్రచందనం కూలీలు ప్రవేశించినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 12 దుంగలను స్వాధీనం చేసుకోగా దుండగులు పరారయ్యారు. అనంతరం నిర్వహించిన గాలింపు చర్యల్లో 9 మంది పట్టుబడగా, వారిని సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటన చేయాలి

మదనపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మదనపల్లె జిల్లాపై స్పష్టమైన ప్రకటన చేయాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఇక్కడి ప్రజలకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. స్థానిక బాస్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో జరిగిన 'మినీ మహానాడులో, బెంగళూరు బస్టాండు వద్ద జరిగిన ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబు, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ మదనపల్లె జిల్లా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. జిల్లా సాధన సమితి ప్రతినిధులు శ్రీనివాసులు, రవిశంకర్, కృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రావిడెంట్ ఫండ్ మిస్సింగ్ జమ చేయాలి



జడ్పీ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్)/రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఆన్‌లైన్ చేసిన తర్వాత ఆ స్లిప్పుల్లో జమ కాని నెలలకు సంబంధించిన మిస్సింగ్ క్రెడిట్‌లను వెంటనే ఉపాధ్యాయుల ఖాతాలకు జమ చేసి వాటిని ఆన్‌లైన్‌లో కనిపించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ కడప కార్యాలయంలో పరిపాలనాధికారి విజయభాస్కర్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నల్లమల రామాంజులు, మహమ్మద్‌రఫీలతో కలిసి సంబేపల్లె మండల ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు జమ కాని డిసెంబరు 2021, జనవరి 2022లకు సంబంధించిన వివరాలను అందజేశారు. వెంటనే వాటిని ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేసి ఆన్‌లైన్ కనిపించే విధంగా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఉద్యోగులు తమ అవసరాలకై దరఖాస్తు చేసిన రుణాలు అంతిమ చెల్లింపుల దరఖాస్తులను వారంలోగా మంజూరు చేయాలని కోరినట్లు తెలియజేశారు. జిల్లా పరిషత్ అధికారులు సానుకూలంగా స్పందించారని భవిష్య నిధి ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. త్వరలోనే వెబ్‌సైట్‌లో ఉంచడానికి ప్రయత్నిస్తామని ఉద్యోగుల రుణాలు అంతిమ చెల్లింపులను కార్యాలయ సిబ్బంది వీలైనంత త్వరగా మంజూరు చేసేలా కృషి చేస్తామని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ నాయకులకు అధికారులు తెలియజేశారు.

తంబళ్లపల్లె సబ్ ట్రెజరీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీటీఏఓ జయలక్ష్మి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఉప ఖజానా కార్యాలయాన్ని సోమవారం జిల్లా ట్రెజరీ అకౌంట్స్ అధికారి (డీటీఏఓ) జయలక్ష్మి తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సబ్ ట్రెజరీ కార్యాలయంలోని 2024-25 ఏడాదికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. పెన్షన్లు, ట్రెజరీ బిల్లుల రికార్డులను పరిశీలించారు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా కార్యాలయం సహా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. తనిఖీ బృందంలో ఎస్టీఓ రామాంజనేయులు, ఎస్‌ఏ ఆనంద్‌బాబు, సీసీ విష్ణువర్ధన్, సీనియర్ అకౌంటెంట్ వెంకటేష్, ఆనంద్‌బాబు, ట్రెజరీ ఎస్టీఓ మారతమ్మ, ఎస్‌ఏ వెంకటకృష్ణ, జేఏ శ్రీనివాసులు, సిబ్బంది ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై జేసీకి వినతి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందచేశారు. ఏపీ వీఆర్‌ల సంఘం విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల రాష్ట్ర పిలుపు మేరకు వీఆర్‌ఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో సుమారు 30 మంది వీఆర్‌ఏలతో కలిసి పీజీఆర్ఎస్ హాల్‌లో జేసీకి వినతిపత్రం ఇచ్చి వీఆర్‌ఏల న్యాయపరమైన డిమాండ్స్‌ను తీర్చాలని కోరారు. వీఆర్‌ఏలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, రికవరీ చేసిన డీఏలను మళ్లీ మాకు తిరిగి ఇవ్వాలని కోరారు.

బినామీ పేర్లతో 60 ఎకరాల భూమి ఆక్రమణ

● చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ డిమాండ్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో లేని వ్యక్తి అక్రమంగా అనుభవిస్తున్న భూములను స్వాధీనం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం తహసీల్దారు యామినిని డిమాండ్ చేశారు. వై.కోట గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్లు 1294/1, 1295/1, 1295ఎన్1, 1295/4, 1295/5, 1295/2లో దాదాపు 60 ఎకరాల ప్రభుత్వ భూమిని బినామీ పేర్లతో ఆక్రమించిన వీరంరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డిపై ఎందుకు కేసులు పెట్టలేదని ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ ఎం.జయరామయ్య ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడులేని నిరుపేద దళిత గిరిజనులు రెండు మూడు సెంట్లు ఆక్రమిస్తే తక్షణమే కేసులు పెడుతున్న రెవెన్యూ యంత్రాంగం వందల ఎకరాలు ఆక్రమించిన విజయ్‌కుమార్‌రెడ్డి పైన ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. నిరుపేదల పట్ల రెవెన్యూ యంత్రాంగానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎంక్వైరీ చేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఏటి పోరంబోకు, గుట్టలు వాగులు వంకలు నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించి కోట్ల రూపాయలు అమ్మకానికి పెడుతున్న భూ మాఫియా డాన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరుపేదలతో కలిసి ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోపాల్, సుబ్బరాఘవులు, వెలుగు మణి, చిన్న మణి, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, సుబ్బయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి సబ్‌జైలు తనిఖీ



సబ్‌జైల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

రాయచోటి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కడప సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంపై వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయసేవా సమితిని, కడప జిల్లా న్యాయసేవ అధికార సంస్థను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

'మెడికల్' ప్రైవేటీకరణను ఉపసంహరించండి

● ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి

● కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రాయచోటి కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):పీపీపీ పద్ధతిలో మెడికల్ కళాశాలల నిర్వహణ యోచనను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య, విద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ విధానానికి కొత్త భాష్యం చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రైవేటు వారికి అప్పగించడం లేదని, ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని, కేవలం నిర్మాణాలు మాత్రమే ప్రైవేట్ చేస్తోందని చెప్పి సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కళాశాలల ప్రైవేటీకరణకు జారీ చేసిన పీపీపీ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, ముబారక్, బత్తల వెంకట్రమణ, నరసింహులు, తిరుమల, దేవా తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అండర్ 19 జిల్లా ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపర్చిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ బాలబాలికల జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమైంది. నేడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు రాష్ట్ర స్థాయి పోటీలకు బయల్దేరారు. సోమవారం క్రీడాకారులకు సగ్రశిక్షణ నుంచి వచ్చిన వారికి క్రీడా దుస్తులను హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, రాములు అందజేశారు. మంగళవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్ ఎడ్యుకేషన్ డీఐఈఓ రాజశేఖర్‌రెడ్డి జిల్లా జట్టును అభినందించారు. కార్యక్రమంలో అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు, అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ, వ్యాయామ ఉపాధ్యాయులు అన్సర్, నరేశ్, విజయ్‌కుమార్, మహేంద్రనాయక్, మురళీధర్, బాలజీ, తదితరులు పాల్గొన్నారు.

పీకేఎం ఉడా చైర్మన్‌గా సురేశ్‌బాబు



కలికిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం ఉడా) చైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్.సురేశ్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పీకేఎం ఉడా పరిధిలో జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలతో పాటు పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలు ఉన్నాయి. ఈ మేరకు నియామకానికి సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవంపై ఏర్పాటు చేసి బ్యాండు మేళాలతో ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.